ప్రజల చెంతకు వైద్య సేవలు

- పది పడకలతో ఆస్పత్రి నిర్మించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- అల్లూరి సీతారామరాజునగర్ వాసులకు మెరుగైన వైద్యం


ఏఎస్సార్‌నగర్‌లోని యూపీహెచ్‌సీ


పరీక్షలు చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్

మురళీనగర్ : పట్టణ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలు మురికివాడల్లోని నివాసితులతోపాటు పట్టణ పేద కుటుంబాలకు వైద్యం అందించడంలో ప్రధాన భూమిక పోషిస్తున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి వార్డులోనూ ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించి ప్రజలకు అన్ని వేళల్లోనూ వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొచ్చింది. ఫలితంగా నిపుణులైన వైద్యులు ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్యం చేస్తున్నారు. ఇందుకోసం కోట్ల రూపాయలతో పక్కా భవనాలను గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో నిర్మించారు. మెడికల్ ఆఫీసర్ తోపాటు ఇతర సిబ్బందిని కూడా నియమించారు. అవసరమైన మందులు అందుబాటులోకి తెచ్చారు. ఇందులో భాగంగా అల్లూరి సీతారామరాజునగర్‌లో పట్టణ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించారు.

50 వేల మందికి అందుబాటులో వైద్యం

జీవీఎంసీ 49వ వార్డులోని 8 సచివాలయాలకు సంబంధించి 53,422 మందికి ఇక్కడి ఆస్పత్రి వైద్య సేవలు అందిస్తోంది. వైద్యాధికారి, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఒక ల్యాబ్ టెక్నీషియన్, ఒక ఫార్మాసిస్టు, ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్, ఒక లాస్ట్ గ్రేడ్ సర్వీసెస్ (ఎల్‌జీఎస్)ను నియమించారు. క్షేత్ర స్థాయిలో 8 మంది ఏఎన్ఎంలు, 8 మంది ఆశా వర్కర్లు పని చేస్తూ ప్రజలకు అవసరమైన వైద్య సేవలను ఇంటింటికీ చేరవేస్తున్నారు. ఎప్పటికప్పుడు వైద్య ఆరోగ్య సమాచారాన్ని సేకరిస్తున్నారు. ప్రాథమిక వైద్యం, గర్భిణులు, బాలింతలకు అవసరమైన వైద్య పరీక్షలతోపాటు మందులు అందిస్తున్నారు. జ్వరాలు, టీబీ, కాలేయ సంబంధిత, మూత్రపిండాల వ్యాధులకు పరీక్షలు చేస్తున్నారు.

- 60 రకాల రక్త పరీక్షలు, బీపీ, సుగర్ పరీక్షలు చేస్తున్నారు. పరీక్షలు చేసిన తర్వాత అదే రోజు సాయంత్రానికి రిపోర్టు ఇస్తున్నారు. 172 రకాల మందులు ఉచితంగా ఇస్తున్నారు.
- రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు.
- మంగళవారం స్త్రీ వైద్య నిపుణులు, బుధవారం పిల్లల వైద్యులు (పీడియాట్రీషియన్) ఇక్కడ అందుబాటులో ఉంటున్నారు.
- గతంలో ఆర్థోపెడిక్, జనరల్ సర్జన్, చర్మవ్యాధుల నిపుణుల వచ్చేవారు. ప్రస్తుతం రావడం లేదు.
- రోజూ 70 నుంచి 80 మందికి వైద్యం చేస్తున్నారు.
- క్రిటికల్ కేసులను కేజీహెచ్‌కు, ఘోష ఆస్పత్రి (వీజీహెచ్)కి రిఫర్ చేస్తున్నారు.
- కుక్క, పాము కాటుకు ఇంజక్షన్లు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి.

10 పడకలతో ఆధునిక ఆస్పత్రి

అల్లూరి సీతారామరాజునగర్‌లోని ఆస్పత్రిలో పది పడకలతో ఓ వార్డు ఏర్పాటు చేశారు. అందులో అధునాతన వైద్య పరికరాలు కలిగిన ల్యాబ్, మెడికల్ ఆఫీసర్ గది, ఎమర్జెన్సీ రూము, ఫార్మసీ రూము, రిసెప్షన్ గది నిర్మించారు. వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ అప్పటి సమన్వయకర్త కేకే రాజు కృషి మేరకు 49వ వార్డు కార్పొరేటర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరావు ఆధ్వర్యంలో దీన్ని నిర్మించారు. ఈ ఆస్పత్రిని మాజీ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని 2021 అక్టోబరు 2న ప్రారంభించారు.


ఏఎస్సార్‌నగర్‌లోని యూపీహెచ్‌సీ రిసెప్షన్‌లో సిబ్బంది

క్లుప్తంగా

కల్వర్టు పనులు ప్రారంభం


అబిద్‌నగర్‌లో గెడ్డపై నిర్మిస్తున్న బాక్సు కల్వర్టు

సీతంపేట : జీవీఎంసీ 44వవార్డు పరిధి అబిద్ నగర్ షాదీఖానా కల్యాణ మండపం పక్కన గల రహదారిలో శిథిలావస్థలో ఉన్న కల్వర్టు తొలగించి బాక్సు కల్వర్టు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ముస్లిం తాటిచెట్లపాలెం వెళ్లే మార్గంలో ఉన్న కల్వర్టు గోడలు బలహీనమవడం, కొంత భాగం కుంగిపోవడంతో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, వార్డు కార్పొరేటర్ బానాల శ్రీనివాసరావు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.19 లక్షల నిధులు మంజూరు చేయించారు. ఆ తర్వాత ఎన్నికల కోడ్, ప్రభుత్వం మారడంతో పనుల ప్రారంభంలో జాప్యం జరిగింది. ప్రస్తుతం పాత కల్వర్టు పూర్తిగా తొలగించారు. దాని స్థానంలో కొత్తగా బాక్సు కల్వర్టు నిర్మాణ పనులు కొద్ది రోజులుగా జరుగుతున్నాయి. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మహిళా వాకర్స్ క్లబ్ సేవలు ఆదర్శనీయం


లలితారెడ్డిని సత్కరిస్తున్న మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు

మురళీనగర్ : మహిళా వాకర్స్ క్లబ్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ఆదర్శనీయమని వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి అన్నారు. మహిళా వాకర్స్ క్లబ్ వార్షిక సర్వసభ్య సమావేశం గురువారం సాయంత్రం అధ్యక్షురాలు సత్తి లలితారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తక్కువ కాలంలో ఎక్కువ సేవా కార్యక్రమాలు నిర్వహించారని చెప్పారు. ఈ సందర్భంగా ఉత్తమ మహిళా వాకర్స్ క్లబ్, ఉత్తమ సేవా అవార్డులు సాధించిన అధ్యక్షురాలు లలితారెడ్డిని అభినందించారు. ఏడాది కాలంలో నిర్వహించిన సేవా కార్యక్రమాల వివరాలను కోశాధికారి పి.కమల తెలిపారు. 2025 సంవత్సరానికి నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షురాలిగా కె.మాధవి, కార్యదర్శిగా పి.కమల, కోశాధికారిగా ఎం.శేషామణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

స్వస్థలానికి ఒడిశా కార్మికుడు


వసతి గృహంలో ఒడిశా వాసి ప్రశాంత్‌కుమార్ నాయక్

సీతమ్మధార: కాంట్రాక్టర్ వేధింపులకు గురైన ఒక కార్మికుడిని ఒడిశా పంపేందుకు సన్నాహాలు చేస్తున్నామని ఏయూటీడీ ప్రతినిధి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఒడిశాలోని కటక్‌కు చెందిన ప్రశాంత్ కుమార్ నాయక్ సిమెంట్ పని కోసం వైజాగ్ వచ్చాడు. ఒక చోట పనికి కుదిరాడు. పని చేశాక డబ్బులు అడిగినందుకు కాంట్రాక్టర్ అతన్ని కొట్టి మొబైల్ ఫోన్ తీసుకున్నాడు. చేసేది లేక ప్రశాంత్ కుమార్ నాయక్ ఎంవీపీ కాలనీలో ఉండగా ఆ ప్రాంతంలో నైట్ రౌండ్స్‌లో ఉన్న స్టేషన్ పోలీసు ఐ. అప్పలరాజు ఇతర సిబ్బంది అతని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అతన్ని ద్వారకానగర్ టీఎస్ఆర్ కాంప్లెక్సులో గల జీవీఎంసీ–ఏయూటీడీ షెల్టర్‌కు పంపించారు. ప్రశాంత్ కుమార్ నాయక్‌కు జీతం ఇవ్వకుండా, మొబైల్ ఫోన్ తీసుకున్న కాంట్రాక్టర్‌ను పిలిపించి సమస్య పరిష్కరించారు. ప్రశాంత్ కుమార్ నాయక్‌ను అతని ఊరు పంపించే ప్రయత్నం జరుగుతుందని ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు.

ధనుర్మాసోత్సవాలకు ఏర్పాట్లు


ధనుర్మాసోత్సవాల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు


లలితాపీఠంలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కృష్ణసేన్, తదితరులు

మురళీనగర్ : మురళీనగర్ రామాలయంలో ధనుర్మాసోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ నిర్వహణ కమిటీ అధ్యక్షుడు టి.నారాయణ రెడ్డి, కార్యదర్శి సనపల వరప్రసాద్ తెలిపారు. ఈ నెల 16న ఉదయం 5.30 గంటల నుంచి పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలతో ప్రారంభమై జనవరి 13న గోదా రంగనాథ స్వామి కల్యాణంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. ఈ సందర్భంగా రోజూ సీతారామచంద్ర స్వామికి తిరుప్పావై పాశుర విన్నపం, విశేష అర్చనలు నిర్వహిస్తామన్నారు. రామాలయం అర్చకుడు గొడవర్తి రఘురామాచార్యులు ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ మేరకు ఆలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ధనుర్మాసోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు.

16 నుంచి శ్రీలలితాపీఠంలో...

సీతంపేట : శ్రీలలితా పీఠంలో ఈ నెల 16 నుంచి జనవరి 13 వరకు ధనుర్మాస వ్రత మహోత్సవాలు నిర్వహించనున్నామని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధనుర్మాస వ్రతంలో భాగంగా పీఠంలోని శ్రీ భూ నీలా సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి సన్నిధిలో రోజూ నిత్య కైంకర్యం, విశేష సేవలు నిర్వహిస్తామన్నారు.

ఉదయం 4 గంటలకు సుప్రభాతం, స్వామి, అమ్మవార్లకు అర్చన, బాలభోగ నివేదన, పాశురాల విన్నపం జరుగుతాయని తెలిపారు. విశేష పూజా కార్యక్రమాల్లో భాగంగా డిసెంబర్ 18న కుచేల దివసం, 24న ధూప పాశుర విశేషము, 26న ధన్వంతరి హోమం, 31న విశేష పాశురం, జనవరి 2న తిరుప్పావడ సేవ, జవనరి 3న సహస్ర దీపాలంకరణ, 10న వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం, జనవరి 11న కూడార్పై ఉత్సవం, 13న భోగి రోజున గోదా రంగనాయకుల కల్యాణం నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు విశేష పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందాలని కోరారు.

కేంద్రీయ విద్యాలయంలో క్రీడా సంబరాలు


క్రీడలను ప్రారంభిస్తున్న ముఖ్య అతిథి సూర్యప్రతాప్


విన్యాసాలు చేస్తున్న విద్యార్థులు

కంచరపాలెం: స్థానిక 104 ఏరియా కేంద్రీయ విద్యాలయం–1లో గురువారం 50వ వార్షికోత్సవం సందర్భంగా క్రీడలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విద్యాలయ మేనేజ్‌మెంట్ నామినీ చైర్మన్ కమాడోర్ సూర్యప్రతాప్, ప్రిన్సిపాల్ జి.కిషోర్ పాల్గొని క్రీడా వార్షికోత్సవ జ్యోతి వెలిగించారు. ఈ సందర్భంగా సూర్యప్రతాప్ మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో స్ఫూర్తి నింపి ఉత్సాహం, పోరాట పటిమను పెంపొందిస్తాయన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. ప్రిన్సిపాల్ కిషోర్ మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో పోరాట పటిమను ఇనుమడింపజేయడంతో పాటు శారీరక, మానసిక ఉల్లాసానికి, దేహదారుఢ్యానికి దోహదపడతాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు యోగా, కరాటే, బనానా రేస్, డ్రిల్ తదితర అంశాలు ప్రదర్శించారు. జాతీయ స్థాయిలో అండర్–14, అండర్–17లో హ్యాండ్ బాల్, బ్యాడ్మింటన్ క్రీడల్లో స్వర్ణ, రజత పతకాలు సాధించిన విజేతలకు ముఖ్య అతిథులు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో రూల్ ఆఫ్ రిజర్వేషన్లు అమలు


స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ సీజీఎం గాంధీని సత్కరిస్తున్న నాయకులు

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్‌లో ఎస్సీ, ఎస్టీలకు చెందిన రూల్ ఆఫ్ రిజర్వేషన్లు ఖచ్చితంగా అమలు చేస్తున్నామని హెచ్‌ఆర్ సీజీఎం జి.గాంధీ అన్నారు. స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్‌డీ సెంటర్‌లో గురువారం అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.తాడన్న, బయ్యే మల్లయ్య ఆధ్వర్యంలో రిజర్వేషన్ పాలసీపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల అభ్యున్నతికి యాజమాన్యం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. ప్రత్యేక అతిథి, స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ జీఎం ఎం.మధుసూదనరావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ఎన్ని ఇబ్బందుల్లో ఉన్నా ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. హెచ్‌ఆర్‌డీ విభాగాధిపతి టి.ఎ.ఎస్.ఆర్.టాగూర్ మాట్లాడుతూ ఉద్యోగుల కోసం వివిధ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, నైపుణ్యం పెంచుకుని ప్లాంట్ ఉత్పాదకత పెంపునకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ విశ్రాంత హెచ్‌ఆర్ జీఎం కె.సంజీవరావు, ఎస్టీ లైజన్ ఆఫీసర్ బాబు నాయక్, సెల్ ఆఫీసర్ ప్రసాద్, నాయకులు ఎస్.సత్యనారాయణ, ఎల్.వి.రమణ, కె.వి.రత్నం, మోహన్‌బాబు, పుల్లారావు, బి.డి.నాయక్, గణేష్, అప్పారావు పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్

మద్రిపాలెం : జీవీఎంసీ 51వ వార్డు అంబేడ్కర్ కాలనీలో దోమల నివారణకు ఫాగింగ్ చేశారు. కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ సూచనల మేరకు జీవీఎంసీ సిబ్బంది ఫాగింగ్ నిర్వహించారు. ఇటీవల దోమలు ఎక్కువగా ఉండడంతో ప్రజలు అనారోగ్యానికి గురికాకూడదనే ఉద్దేశంతో ఫాగింగ్ చేయించామని కార్పొరేటర్ తెలిపారు. అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

ప్రాంగణ ఎంపికల్లో 78 మందికి ఉద్యోగాలు

మురళీనగర్ : ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 10, 11న నిర్వహించిన మెగా జాబ్ మేళాలో 78 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. జిల్లా ఉపాధి కల్పనాధికారి సీహెచ్ సుబ్బిరెడ్డి (క్లరికల్), జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి టి.చాముండేశ్వరరావు పర్యవేక్షణలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ నెల 10న కంచరపాలెం పాలిటెక్నిక్ కాలేజీలో నిర్వహించిన జాబ్‌మేళాలో 40 మంది ఉద్యోగాలు సాధించారు. గాజువాకలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్‌లో 11న నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో ఫ్లూయెంట్ గ్రిడ్, గ్లాండ్ ఫార్మా, అపోలో ఫార్మసీ సంస్థలు నిర్వహించిన జాబ్ మేళాకు 120 మంది హాజరు కాగా 38 మంది ఉద్యోగాలు సాధించారు. స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ టి.లక్ష్మి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎం.రమేష్‌నాయుడు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

రెవెన్యూ సదస్సు నేడు

సీతమ్మధార : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రెవెన్యూ సదస్సులో భాగంగా ఏఎస్ఆర్ నగర్‌లో శుక్రవారం సదస్సు నిర్వహిస్తామని విశాఖ అర్బన్ తహసీల్దార్ ఎం.రమేష్ గురువారం 'సాక్షి'కి తెలిపారు. జీవీఎంసీ పరిధి 49వ వార్డు ఏఎస్ఆర్ నగర్‌లో గల సచివాలయంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు సదస్సు జరుగుతుందన్నారు. సదస్సులో ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు పాల్గొంటారని తెలిపారు. సంబంధిత రెవెన్యూ వార్డు పరిధిలోని ప్రజలంతా భూ వివాదాలు, ఇతర సమస్యల మీద అర్జీలను అందజేయాలని ఆయన కోరారు.

అలరించిన సంగీత విభావరి


జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నిర్వాహకులు

డాబాగార్డెన్స్: దేవీ సుస్వరాలు సంగీత సంస్థ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. సోషల్ మీడియా స్టేట్ చైర్మన్ సన్‌మూర్తి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు శ్రీదేవి నిర్వహణలో నిర్వహించిన సంగీత విభావరిలో అలనాటి ఆణి ముత్యాలను నగరానికి చెందిన గాయనీ గాయకులు ఆలపించారు. హుషారైన యుగళ గీతాలతో కళాకారులు తమ ప్రతిభ ప్రదర్శించారు. విభావరిలో గాయనీ గాయకులు అమ్మాజీరావు, ఎన్‌వీఆర్ మూర్తి, సింగ్, సూర్యప్రకాష్, జగన్మోహన్, అరుణకుమార్, పద్మనాభం, భాగ్యలక్ష్మి, మాధురి, మను, పావని, సుజాత, రంజిత, రమణి యాంకర్ లక్ష్మీ స్వరూప, ఆక్వా కన్సల్టెంట్ జి. త్యాగరాజు, లోకేష్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

కోనకు గద్దర్ జాతీయ సేవా పురస్కారం


పురస్కారంతో కోన ప్రకాష్‌ను సత్కరిస్తున్న తెలంగాణ సాంస్కృతిక సంస్థ ప్రతినిధులు

డాబాగార్డెన్స్: గద్దర్ జాతీయ సేవా పురస్కారాన్ని తెలంగాణ సాంస్కృతిక సంస్థ గురువారం డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో జైభీమ్ కన్వీనర్, అవంతి కంప్యూటర్స్ డైరెక్టర్ కోన ప్రకాష్‌కు అందజేసింది. తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారథి, చైర్మన్ డాక్టర్ వెన్నెల గద్దర్ చేతుల మీదుగా పురస్కారం అందజేశారు. పేదలకు విద్యా, వైద్యం అందించాలని పరితపించి మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో మందికి సేవలందించడమే కాక అనేక మందికి ఉచితంగా కంప్యూటర్ శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించారు. ఉచిత రక్తదాన శిబిరాలు, కేన్సర్ అవగాహన సదస్సులు కోన ప్రకాష్ నిర్వహిస్తూ వస్తున్నారు. ఆయన సేవలను గుర్తించి సేవా పురస్కారంతో సత్కరించారు. కార్యక్రమంలో పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, జైభీమ్ టీమ్ డాక్టర్ రమేష్‌బాబు, పాటల తూటా ఉదయ్‌భాస్కర్, గుండయ్య, కోన శంకర్, మురళి పాల్గొన్నారు.

బోధనాభ్యసన ఉపకరణాల ప్రదర్శన


ప్రదర్శనలో బోధనాభ్యసన ఉపకరణాలు

తాటిచెట్లపాలెం : తాటిచెట్లపాలెంలో గల కేంద్రీయ విద్యాలయలో గురువారం బోధనాభ్యసన ఉపకరణాల (టీఎల్‌ఎం) ప్రదర్శనను ప్రిన్సిపాల్ కమల్‌జీత్ ప్రారంభించారు. 2020 జాతీయ విద్యావిధానం ప్రకారం విద్యార్థులకు బోధనలో ఈ ఉపకరణాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటున్నాయి. ఉపాధ్యాయులు తమ బోధనలో అనుసరించే వివిధ రకాల ఉపకరణాలను ప్రదర్శనలో ఉంచారు. టీఎల్‌ఎం ఉపాధ్యాయులు, విద్యార్థులు సృజనాత్మకంగా ఆలోచించేందుకు, వారి బోధనా కేలెండర్ సమర్థంగా ముందుకు సాగేందుకు ఈ ప్రదర్శన ఉపయోగకరంగా ఉంటుందని ప్రిన్సిపాల్ కమల్‌జీత్ తెలిపారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వీఎం శైలజ, సిబ్బంది ప్రగతి, గోవింద, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తాటిచెట్లపాలెం : ఈపీడీసీఎల్ జోన్ – 1 పరిధిలో హెచ్‌టీ లైన్ నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బి.సింహాచలం నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు బీఎస్ లే అవుట్, పద్మశ్రీ హాస్పిటల్ ఏరియా, ఎన్‌జీజీవోస్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు గమనించాలని కోరారు.

మందుబాబులకు అడ్డాగా పార్కు

నిర్వహణను గాలికొదిలేసిన ప్రభుత్వం


శంకువానిపాలెంలో అధ్వానంగా పార్కు


పార్కులో మందు బాటిళ్లు

సీతంపేట : ప్రజలకు ఆహ్లాదం, వ్యాయామం కోసం లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన పార్కు నిరుపయోగంగా మారింది. ప్రస్తుత ప్రభుత్వం, అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడంతో పార్కు నిర్వహణను గాలికొదిలేశారు. ఫలితంగా మందుబాబులకు అడ్డాగా మారింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పన, ఆహ్లాదం, వ్యాయామం కోసం పార్కులు, ఓపెన్ జిమ్‌లు, వాకింగ్ ట్రాక్‌ల నిర్మాణం పెద్ద ఎత్తున చేపట్టింది. ఇందులో భాగంగా 26వ వార్డు శంకువానిపాలెం ప్రాంతం చాకలిపేటలో గల ఖాళీ స్థలంలో సుమారు రూ.16.30 లక్షల జీవీఎంసీ నిధులతో పార్కు అభివృద్ధి చేశారు. ప్రహరీ నిర్మించి, మధ్యలో వాకింగ్ ట్రాక్, పాదచారులు విశ్రాంతి తీసుకునేందుకు సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. పార్కుకు రక్షణగా గేటు ఏర్పాటు చేసి నిర్వహణ బాధ్యతను స్థానికులకు అప్పగించారు. అంత వరకు బాగానే ఉంది. పార్కులో పచ్చదనం అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉండగా ఎన్నికల కోడ్ వచ్చేసింది. అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి... పార్కులో పెండింగ్‌లో ఉన్న పచ్చదనం పనులు పక్కన పెట్టేసింది. నిర్వహణను పూర్తిగా గాలికొదిలేశారు. ఫలితంగా పార్కులో సిమెంట్ బెంచీలు విరిగిపోయాయి. మందుబాబులకు, ఆకతాయిలకు అడ్డాగా మారింది. ప్రజల కోసం లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన పార్కు నేడు కళావిహీనమై నిరుపయోగంగా మారింది. కొత్త ప్రభుత్వం కొలువుతీరి ఆరునెలలు గడిచినా ఒక్క అభివృద్ధి పనీ ఎక్కడా ప్రారంభించలేదు సరికదా... కనీసం గత ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిరక్షించి కొనసాగించాలని పలువురు కోరుతున్నారు.

విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి


నినాదాలు చేస్తున్న సీఐటీయూ నాయకులు

సీతమ్మధార: రాష్ట్రానికి ఏకైక భారీ పరిశ్రమ అయిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు వి. కృష్ణారావు డిమాండ్ చేశారు. జీవీఎంసీ గాంధీ పార్కు వద్ద జరుగుతున్న దీక్షా శిబిరంలో మద్దిలపాలెం జోన్ సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాం కంటే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే ప్లాంట్ ప్రభుత్వ రంగంలో కొనసాగుతుందా లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ఈ ప్రభుత్వం వచ్చాక కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు, పర్మినెంట్ కార్మికులను వీఆర్ఎస్ పేరుతో బయటికి నెట్టేయడం జరుగుతుందన్నారు. జీవీఎంసీకి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు డివిడెంట్ల రూపంలో పన్నులు చెల్లిస్తున్న స్టీల్‌ప్లాంట్‌కి సొంత గనులు కేటాయిస్తే ఉత్తరాంధ్ర యువతకి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. తక్షణమే కూటమి ప్రభుత్వం స్టీల్ ప్లాంట్ రక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ శిబిరంలో సీఐటీయూ సీనియర్ నాయకులు జీవీఎస్ చలపతి, కె. కుమారి, పి. విజయ, సూరప్పుడు, వీఎంఆర్డీఏ కార్మికులు రాంబాబు, నర్సింగ్‌రావు, చిన్నారావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రచయిత అజీజ్ కథా సంపుటి ఆవిష్కరణ


అజీజ్ కథా సంపుటిని ఆవిష్కరిస్తున్న తటవర్తి త్రినాథరావు తదితరులు

మహారాణిపేట: విశాలాంధ్ర పుస్తక ప్రదర్శన ప్రాంగణంలో కర్నూలుకు చెందిన ఎస్.డి.వి. అజీజ్ రచించిన కథా సంపుటి 'అజీజ్ కథలు' పుస్తకావిష్కరణ గురువారం జరిగింది. అభ్యుదయ రచయితల సంఘం కార్యదర్శి ఉప్పల అప్పలరాజు అధ్యక్షత వహించారు. యూఎస్‌ఏకు చెందిన ప్రసిద్ధ సాహితీవేత్త తటవర్తి త్రినాథ నాగేశ్వరరావు కథా సంపుటిని ఆవిష్కరించారు. ఎస్. హనుమంతరావు కథలను సమీక్షించారు. అనంతరం కథా సాహిత్యంపై విభిన్న కోణాల్లో చర్చ జరిగింది. డాక్టర్ డీవీ సూర్యారావు, ఆచార్య వి. సిమ్మన్న, మేడా మస్తాన్ రెడ్డి, శిరేల సన్యాసిరావు, అడపా రామకృష్ణ, వి. నాంచారయ్య, బసు పోతన చర్చలో పాల్గొన్నారు.